క్లుప్తంగా

దాసాంజనేయ స్వామికి అభిషేకాలు


దాసాంజనేయస్వామికి అభిషేకం చేస్తున్న స్వాత్మానందేంద్ర సరస్వతి

పెందుర్తి: చినముషిడి వాడలోని శారదా పీఠం వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం మూడోరోజు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. పీఠ ప్రాంగణంలోని 18 అడుగుల ఏకశిల దాసాంజనేయస్వామికి ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా అభిషేకాలు చేశారు. యాగశాలలో మన్యుసూక్త హోమం, లక్ష్మీగణపతి హోమం, రాజశ్యామల యాగం శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం చిన్నారుల పౌరాణిక ప్రదర్శన ఆకట్టుకుంది. రాజశ్యామలా సౌభాగ్యవ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా గురువారం వల్లీ కల్యాణం, సాయంత్రం రథోత్సవం, శోభాయాత్ర చేపట్టనున్నట్లు పీఠం ప్రతినిధులు తెలిపారు.

ఘనంగా రోళ్ల పైడిమాంబ ఆలయ వార్షికోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న దేముడు తదితరులు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు చీమలాపల్లి ఆరాధ్య దేవత రోళ్ల పైడిమాంబ ఆలయ 11వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు జరిపారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు 1500 మంది అన్నప్రసాదం స్వీకరించారు. అమ్మవారిని కార్పొరేటర్ ముమ్మన దేముడు, నాయకుడు గండి వంశీదీప్, ఆలయ ధర్మకర్త అయిత ఎర్రిబాబు, గ్రామపెద్దలు విశ్వేశ్వరరావు, అయిత ఎర్రయ్య, అయిత చిన చిన్నోడు, దువ్వి అప్పారావు, అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

అప్పన్న చందనం సమర్పణకు రూ. లక్ష విరాళం


ఏఈవోకి చెక్కు అందజేస్తున్న గుబ్బి సివిల్ ఇంజినీరింగ్ సిబ్బంది

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనం సమర్పణ నిమిత్తం లక్ష రూపాయల విరాళాన్ని బుధవారం మహారాష్ట్రకి చెందిన గుబ్బి సివిల్ ఇంజినీరింగ్ సంస్థ ఉద్యోగులు అందజేశారు. ఉదయం సింహగిరికి వచ్చిన ఆ సంస్థ ఉద్యోగులు సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్‌కి అందజేశారు. దేవస్థానం తరఫున దాతలకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం అందజేశారు.

అప్పన్న సన్నిధిలో సౌత్ సెంట్రల్ రైల్వే ఐజీ



బేడా ప్రదక్షిణ చేస్తున్న అరోమా సింగ్ ఠాగూర్

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం సౌత్ సెంట్రల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ అరోమా సింగ్ ఠాగూర్ దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆమె పేరిట అర్చకులు అంతరాలయంలో స్వామికి పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, జ్ఞాపికను ఏఈవో ఆనంద్ కుమార్ అందజేశారు.

అప్పన్నకు ఎమ్మెల్యే వంశీ పూజలు..


సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సతీ సమేతంగా దర్శించుకున్నారు.

అంగన్‌వాడీలో 'ఈసీసీఈ- డే'


పిల్లల బరువును పరీక్షిస్తున్న టీచర్ విజయలక్ష్మి

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు కంచరపాలెం దరి గొల్లకంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఎర్లీ చైల్డ్ కేర్ ఎడ్యుకేషన్(ఈసీసీఈ)-'డే' కార్యక్రమాన్ని అంగన్‌వాడీ టీచర్ టి.విజయలక్ష్మి నేతృత్వంలో బుధవారం నిర్వహించారు. పిల్లల వికాసం, పెరుగుదల, పర్యవేక్షణ అంశాలపై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లల బరువులు, సామర్థ్యాలను పరీక్షించారు. ఆయా కుమారి, పలువురు తల్లులు, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి.. సుస్తీ


సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న సబ్బవరం పీహెచ్‌సీ

వసతుల లేమి.. అరకొర సిబ్బందితో సతమతం

అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్న ప్రజలు


అధ్వానంగా ఉన్న సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర రోడ్డు

సబ్బవరం: మండల కేంద్రంలో ఉన్న సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వసతుల సమస్యతో సతమతమవుతోంది. గతంలో 30 పడకల ఆస్పత్రిగా ఉండే ఇది ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా డి–గ్రేడ్ కావడంతో దయనీయంగా మారింది. జాతీయ రహదారిని ఆనుకుని ఉండటంతో పాటు మండల కేంద్రంలో మిగిలిన గ్రామాలకు అత్యంత సమీపంలో ఉండటంతో రోగుల తాకిడి అధికంగా ఉంటుంది.

జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల బారిన పడిన క్షతగాత్రులకు సంజీవినిలా సేవలందించేది. అయితే ప్రస్తుతం వసతుల సమస్య, చాలీ చాలని సిబ్బందితో శిథిలావస్థలో ఉన్న భవనంలో నెట్టుకొస్తున్నారు.

తగ్గిన స్థాయి..

35 సంవత్సరాల క్రితం 30 పడకల ఆస్పత్రిగా సబ్బవరం ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత 30 పడకల ఆస్పత్రి నుండి డి–గ్రేడ్ చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా మార్చేశారు. దీంతో ఇక్కడ సేవలందించే సుమారు 40 మంది వైద్య సిబ్బందిని సగానికి పైగా కుదించారు. దీంతో ఆస్పత్రిలో ఉండే గైనిక్ వార్డుతో పాటు పలు వార్డుల నిర్వహణ లేక నిరుపయోగంగా మారడంతో ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. అసరమైన గదులను వాడుకుని మిగిలిన వాటిని వదిలేయడంతో వాటిని జిల్లా డ్రగ్ స్టోర్‌గా వినియోగించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో స్పెషలిస్ట్ సేవలు..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సబ్బవరం పీహెచ్‌సీలో పలు స్పెషలిస్ట్ సేవలు అందుబాటులో ఉండేవి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత స్పెషలిస్ట్ సేవలు నిలిచిపోయాయి. అప్పట్లో ప్రతి శుక్రవారం జనరల్ సర్జన్ వచ్చి ప్రత్యేక వైద్య సేవలందించేవారు. ప్రతి మంగళవారం ఈఎన్‌టీ వైద్యులు సేవలందించేవారు. నెలకు ఒకసారి గైనిక్ సేవలందించేవారు.

హామీల అమలు ఏదీ?

ప్రస్తుతం ఆస్పత్రికి కనీస వసతులు, రోడ్డు సౌకర్యం లేక రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్న రోడ్డు శిథిలావస్థకు చేరుకున్నా మరమ్మతుకు నోచుకోలేదు. వీటితో పాటు తరచూ తాగునీటి సమస్య, వాడుక నీటి ఇబ్బందులు వేధిస్తున్నాయి. శిథిలావస్థలో ఉన్న ఆస్పత్రి భవనాన్ని తొలగించి నూతన భవనాలు నిర్మిస్తామని ప్రజా ప్రతినిధులు హామీలు గుప్పిస్తున్నా ఆచరణలో కానరావడంలేదు.

అరకొర సిబ్బంది..

ప్రస్తుతం చాలీ చాలని వైద్య సిబ్బందితో ఆస్పత్రి నడుస్తోంది. ఇద్దరు డాక్టరు, ముగ్గురు స్టాఫ్ నర్స్‌లు, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక ఫార్మసిస్ట్ ఒక యూడీసీ, ఒక అటెండర్, ఒక నైట్ వాచ్‌మెన్, నలుగురు సూపర్‌వైజర్లు విధులు నిర్వర్తిస్తున్నారు. అదనంగా ఒక స్టాఫ్ నర్స్, ఒక ఫార్మసిస్ట్, ఒక మెడికల్ ఆఫీసర్, మరో అటెండర్ పోస్ట్ భర్తీ చేయాల్సి ఉంది.

రోగుల తాకిడి అధికం..



సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోగుల తాకిడి అధికంగా ఉంటుంది. రోజు వారీ సగటున 150 మంది వరకూ ఓపీ కోసం వస్తారు. సబ్బవరం మండల కేంద్రంలో ఉండే ఈ పీహెచ్‌సీ మండలంలోని అన్ని గ్రామాలకు అందుబాటులో ఉండటంతో పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఇక్కడ వైద్య సేవలు పొందుతుంటారు. స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

– డాక్టర్ ఎస్ఎస్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి, సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర

వసతులు లేక ఇబ్బందులు..



ఈ ఆరోగ్య కేంద్రం వసతుల లేమితో సతమతమవుతోంది. గతంలో ఇది 30 పడకల ఆస్పత్రిగా ఉండేది. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రంగా డి–గ్రేడ్ అయింది. దీనిని మరలా పీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయాలని, వైద్య సిబ్బందిని పెంచాలని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదు.

– కర్రి బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సబ్బవరం మండలం

నేటి నుంచి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాలు


భూలోకమాంబ నూతన ఆలయం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో కొలువుదీరిన భూలోకమాంబ నూతన ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలను గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. మహోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7 గంటలకు జలయాత్ర నిర్వహిస్తామని ఆలయ కమిటీ నాయకుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు ఇత్తడి లేదా వెండి చెంబులతో పసుపు నీళ్లు పట్టుకుని తిరువీధి నిర్వహిస్తారని తెలిపారు. అనంతరం ఆలయంలో అమ్మవారి ప్రతిష్ఠ తర్వాత అమ్మవారికి ఆ నీళ్లతో అభిషేకం నిర్వహిస్తారన్నారు. ఉదయం 9 గంటల నుంచి వినాయక పూజ, దీక్షాధారణ, పంచగవ్యప్రాశనం, యాగశాల ప్రవేశం, అఖండదీప స్థాపన, ధ్వజపతాక ప్రతిష్ఠ, మృత్సంగ్రహణం, అంకురారోపణం, జలాధివాసం, క్షీరాధివాసం, అగ్నిప్రతిష్ఠ, హోమాలు నిర్వహిస్తామని తెలిపారు. 7వ తేదీ ఉదయం 8 గంటల నుంచి చతుర్వేద పారాయణాలు, సూర్యనమస్కారాలు, మహాలింగార్చన, మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకం ఉంటాయని తెలిపారు. 8 ఉదయం 11.13 గంటలకు ఆలయ విగ్రహ యంత్ర శిఖర స్థిర ప్రతిష్ఠాపనా మహోత్సవం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి అన్నసమారాధన ఉంటుందని, భక్తులంతా ఈ కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాల్సిందిగా కోరారు.

మోసపూరిత హామీలపై పోరాటం


94వ వార్డు నాయకులతో మాట్లాడుతున్న అదీప్‌రాజ్

పెందుర్తి: ఎన్నికల సమయంలో ప్రజలకు మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ ఇచ్చిన హామీలు తక్షణమే నెరవేర్చేలా ప్రజల తరఫున వారిని నిలదీయాలని నాయకులకు పిలుపునిచ్చారు. బుధవారం రాంపురంలోని క్యాంప్ కార్యాలయంలో జీవీఎంసీ 94వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులతో అదీప్‌రాజ్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వార్డులో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని సూచించారు. పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు అందుబాటులో కల్యాణ మండపాలు


శర్మచే దీక్ష విరమింపజేస్తున్న ఏఈవో ఆనంద్‌కుమార్

సింహాచలం: సింహగిరిపై వివాహాలు చేసుకునే పేదలకు కల్యాణ మండపాలు ఉచితంగా ఇచ్చే యోచన సింహాచలం దేవస్థానమే చేస్తున్నట్టు దేవస్థానం ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ తెలిపారు. కల్యాణ మండపాల లీజుని పూర్తిగా రద్దు చేయాలని, గత కాంట్రాక్టర్‌కి ఇచ్చిన నెలరోజుల గడువుని కూడా ఉపసంహరించుకోవాలని సనాతన ధర్మ పరిరక్షణ సమితి జేఏసీ గడిచిన మూడు రోజులుగా సింహాచలంలోని కొండ దిగువ తొలిపావంచా వద్ద చేస్తున్న రిలే నిరాహార దీక్షల శిబిరాన్ని బుధవారం రాత్రి ఏఈవో ఆనంద్‌కుమార్ సందర్శించారు. దీక్ష చేస్తున్న జేఏసీ కన్వీనర్ పూడిపెద్ది శర్మకు నిమ్మరసం ఇచ్చి దీక్షని విరమింపజేశారు. పేదలకు ఉచితంగా కల్యాణ మండపాలు ఇచ్చేందుకు దేవస్థానమే కసరత్తు చేస్తోందన్నారు. ఈమేరకు త్వరలోనే విధి విధానాలను ప్రకటిస్తామన్నారు. అలాగే గత గుత్తేదారుడికి మండపాల కాంట్రాక్ట్ నెలరోజులు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని దేవదాయ శాఖ కమిషనర్‌కి ఫైల్ పెట్టామన్నారు. దీక్ష విరమించిన పూడిపెద్ది శర్మ మాట్లాడుతూ పేదలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అధిక మొత్తంలో నగదు చెల్లించకుండా కల్యాణ మండపాలను దేవస్థానమే ఉచితంగా ఇచ్చేందుకు పూనుకోవడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. కార్యక్రమంలో హిందూ జేఏసీ కార్యదర్శి మీసాల రవీంద్ర, నాయకులు నాగభూషణం, కాళ్ల జగన్‌మోహన్, చందు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారి పాదాల ప్రతిష్ఠాపన


పోలమ్మతల్లి పాదాలకు పూజలు చేస్తున్న రవికుమార్ తదితరులు

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెంలో కొలువైన శ్రీపోలమ్మతల్లి అమ్మవారి పాదాల ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలందరిపై ఉండాలని అకాంక్షించారు. గ్రామ సర్పంచ్ బోను దేముడమ్మ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బోను గంగునాయుడు, సిరపరపు వాసు, ఐడీ బాబు, పి. దేముడు ,బోను బాను, నాగరాజు, సింగంపల్లి దేముడు, రావిలపల్లి అప్పలనాయుడు, బండయ్య, కరక రాము, గురి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణ అందరి బాధ్యత


సమావేశంలో పాల్గొన్న నరేంద్రనాద్ చౌదరి

పరవాడ: దేవాలయ కేంద్రంగా భజన, సత్సంగం, సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ విశాఖ జిల్లా కన్వీనర్ మేదరమెట్ల నరేంద్రనాథ్ చౌదరి సూచించారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ కూడలిలో శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరు ధర్మనిధి సభ్యత్వం తీసుకోవాలన్నారు. దేవాలయ కేంద్రంగా ఏకాదశి రోజున నగర సంకీర్తన, ప్రతి పౌర్ణమి రోజున సామూహిక హారతి నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా కన్వీనర్ పెదపాటి కృష్ణవేణి, డి.లక్ష్మి, డి.సంజీవరావు, జి.ఎరుకునాయుడు, పైల శ్రీను, వానపల్లి అప్పలరాజు, ఎల్.అప్పలనాయుడు, ధర్మ ప్రచారక్ వెన్నెల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన


కిరణ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శివకుమార్

పెందుర్తి: ఉత్తరాఖండ్‌లో ఇటీవల జరిగిన 38వ జాతీయ స్థాయి క్రీడల్లో ఖోఖో విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున పినగాడి వెల్ఫేర్ కళాశాల విద్యార్థి బర్నికాన కిరణ్ ప్రాతినిధ్యం వహించాడు. పలు మ్యాచ్‌ల్లో చక్కటి ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.శివకుమార్, పీడీ బి.రమణారావు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

బ్రహ్మ విద్యేశ్వరి అలంకరణలో రాజరాజేశ్వరీదేవి


సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవిని పురవీధుల్లో ఊరేగిస్తున్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా బుధవారం సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి బ్రహ్మ విద్యేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ రూపంలో అమ్మవారిని దర్శించుకుంటే శత్రు బాధ వినాశనం, సకల ధర్మ సంరక్షణ కలుగుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అమ్మవారి సన్నిధిలోని యాగశాలలో బ్రహ్మవిద్యేశ్వరి సహిత నకులి శ్యామా హోమం నిర్వహించారు. సాయంత్రం నుండి అమ్మవారి పల్లకీ సేవలో భాగంగా శ్రీమేరు ఆలయం, కార్యసిద్ధి గణపతి ఆలయాల పుర వీధుల్లో భజనలు, నాట్యాలు కోలాహలంగా నిర్వహించారు.

కార్పొరేట్లకు కొమ్ము కాస్తున్న మోదీ ప్రభుత్వం



మండల కాంప్లెక్స్‌లో సీఐటీయూ నాయకుల నిరసన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఐటీయూ నేతలు

పరవాడ: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మండల కాంప్లెక్స్ కూడలిలో బుధవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా మార్చి కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. పార్లమెంట్‌లో నాలుగేళ్ల క్రితం ఎటువంటి చర్చ లేకుండానే వీటిని ఆమోదించారన్నారు. కార్మికుల పోరాటాల ఫలితంగా వాటిని ఇంత వరకు అమలు చేయలేదన్నారు. ఏప్రిల్ నుంచి అమలు చేయాలని చూస్తుందన్నారు. లేబర్ కోడ్లు అమలు జరిగితే కార్మికులకు పని గంటలు పెరగడంతో హక్కులు కోల్పోతారన్నారు. అందుచేత కార్మికులు లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్.వెంకటలక్ష్మి, ఎస్.పైడిలక్ష్మి, ఎం.ఉమ, టి.పరదేశమ్మ, సత్యవతి, ఐద్వా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

పెందుర్తి: కేంద్రం ప్రవేశ పెట్టిన ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ పిలుపునిచ్చారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పలు రంగాలకు చెందిన కార్మికులు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ ప్రధాని మోదీ ప్రమాణం చేసిన తొలిరోజు నుంచీ ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మకానికి పెట్టారని విమర్శించారు. మొన్నటి బడ్జెట్‌లో కూడా కార్పొరేట్లకు అనుకూలంగానే కేటాయింపులు జరిపారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ, ప్రధాన కార్యదర్శి దేవి, సీఐటీయూ నాయకులు అప్పలనాయుడు, ప్రభుదేవా, ఈశ్వరరావు, రాజు, రామలక్ష్మి పాల్గొన్నారు.

అవగాహనతోనే క్యాన్సర్ నివారణ


మాట్లాడుతున్న పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి కరిష్మా


పరవాడ: క్యానర్స్ పట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకోవాలని పరవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరిష్మా సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన క్యాన్సర్‌పై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్, ఓరల్ (నోటి) క్యాన్సర్లపై తీసుకోవలసిన జాగ్రత్తలపై విపులంగా వివరించారు. క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, లక్షణాలు వివరించారు. క్యాన్సర్ లక్షణాలను గుర్తించిన వెంటనే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించి అవసరమైన సలహాలు, సూచనలు తీసుకోవాలని తెలిపారు. వెలుగు ఏపీఎం బి.రంగారావు మాట్లాడుతూ ఈ రోజు నుంచి ఆరు రోజుల పాటు వీవోఏలందరూ ప్రతి గ్రామంలో పర్యటించి డ్వాక్రా మహిళలు, 12 ఏళ్లు నిండిన బాలికలను సమావేశపరిచి క్యాన్సర్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. అవగాహన సదస్సుల్లో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొనే విధంగా చూడాలన్నారు. సదస్సులో వెలుగు సీసీలు, వీవోఏలు, మండల సమాఖ్య పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రొమ్ము క్యాన్సర్‌పై అప్రమత్తం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారి

పరవాడ: రొమ్ము క్యాన్సర్‌పై తల్లులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి పట్ల అవగాహన కల్పించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో బి.లలితకుమారి సూచించారు. కొత్త గొర్లివానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈసీసీఈ డేను పురస్కరించుకుని బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అదే విధంగా తల్లులకు పూర్వ ప్రాథమిక విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న అంకెలు, అక్షరాలు, ఆట, పాట వస్తువులతో విద్యను కల్పించే విధానంపై అవగాహన కల్పించారు. 0 నుంచి 5 ఏళ్ల పిల్లలకు పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ఎస్.కె.షకీలా, అంగన్‌వాడీ నిర్వాహకులు సీహెచ్ దేవి, నూకరత్నం, ఏఎన్ఎం గౌతమి, ఎం.ఎస్.కె.యశోద, ఆశ కార్యకర్త ఎ.వరలక్ష్మి, ఎ.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

విష్ణుచక్రపురంలో ఘనంగా అప్పన్న కల్యాణం



విష్ణుచక్రపురంలో జీలకర్ర బెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు, హారతి అందుకుంటున్న ఒడిశా భక్తులు

సింహాచలం: ఒడిశాలోని గంజాం జిల్లా విష్ణుచక్రపురంలో బుధవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. సింహాచలం దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఒడిశాలో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా విష్ణుచక్రపురంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రచార రథంలో ఉన్న ఉత్సవమూర్తులను వేదికపై కొలువుదీర్చారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. పెద్ద ఎత్తున ఒడిశా భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి కల్యాణాన్ని కనులారా తిలకించారు. భక్తులకు ప్రసాదం అందజేశారు. దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు చిన్నా, రఘునాథ్, పవన్ తదితరులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

అంబేడ్కర్ ఆశయాల అమలే ధ్యేయం


రావాడలో ఎస్సీ కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న అతిథులు

పరవాడ: అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్టీపీసీ ఏజీఎం బి.నరసింహం అన్నారు. ఎన్టీపీసీ సింహాద్రి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రావాడ, కలపాక గ్రామాల్లోని ఎస్సీ కుటుంబాలకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపట్టడానికి కృషి చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల అభివృద్ధికి ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులను కేటాయించాలని అసోసియేషన్ అధ్యక్షుడు జి.చంద్రశేఖర్ కోరారు. అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ద్వారా పేదలకు సహాయం చేసే అదృష్టం కలిగిందన్నారు. సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, అసోసియేషన్ ప్రతినిధులు రాజ్‌కుమార్‌మీనా, బి.మణికుమార్, కె.నారాయణరావు, ఎస్.సురేష్, సింహాచలం, చిట్టిబాబు, చిన బ్బాయి, శివానీ పాల్గొన్నారు.